# ఒక సంవత్సరం గడిచేటప్పటికి...

మీనాక్షికి ఏడెనిమిదేళ్ళొచ్చేటప్పటి కల్లా కొంచెం ప్రపంచ జ్ఞానం రాదొడిగింది.

ప్రపంచమంతా అంధకారంగా తోచేది – మెలకువగా వున్నా, నిద్దరోతున్నా, కళ్లు తెరిచినా, మూసుకున్నా.

తన మంచం, ఆటవస్తువులు, కుర్చీ, బట్టలపెట్టి, గదిలో మిగతా సామాను అంతా, గుర్తు వల్ల అట్టే కష్టం లేకుండా తెలుసుకోగలిగేది. కళ్ళు అందరి కళ్ళల్లా పైకి కన్పించినా అసలు చూపానవు.

కళ్లున్నవాళ్లకి తక్కిన అవయవాల ప్రాముఖ్యత అంతగా తెలీదుగాని, కాళ్లు చేతుల స్పర్శజ్ఞానం, చెవులూ ఎంత పనికొస్తున్నాయని? అవే లేకపోతే మీనాక్షి జీవితం ఏవిధంగా వుండేదో?

తన గదికి పడమటివైపు గుమ్మం తెరుస్తే అది తోట. అక్కడికి మెల్లిగా తడుముకుంటూ వెళ్ళి, స్నేహితులతో ఆడుకునేది. కళ్లు లేనిమూలాన్ని తన్నే తల్లిగా వుండమనేవారు. తక్కినవాళ్లు దాగుడుమూతలు ఆడుతూ తన్ని ముట్టుకుందుకు వచ్చినప్పుడల్లా ఏదో పెద్ద రాణీ సర్కారులా భావించుకునేది.

కొంతసేపయ్యాక వాళ్లు ఆడుకుందుకు వేరే చోటుకి వెళ్ళేవాళ్ళు, ఆమెని మర్చిపోయి. అట్లాంటి సమయాల్లో చాలా బాధపడేది. ఒంటరిగా క్రోటన్సు మొక్కల్ని ముట్టుకుంటో, బెంచీమీద కూచుని తనలో తనే ఏవో ఆలోచించుకునేది; ఆడుకునేది; ఆనందించేది.

సాయంత్ర మవుతున్నట్టు గూళ్ళకెళ్ళే కాకుల రెక్కల చప్పుడూ, పెద్దగా ప్రపంచాన్ని ఆవరించే నిశ్శబ్దమూ ఆమెకి చిహ్నాలు.

కాఫీకీ, భోజనానికి అమ్మ తీసుకొని వెళ్ళి, పెట్టేది. అమ్మంటే మీనాక్షికి అర్థమయింది. వెచ్చని వొడిలో పడుక్కోపెట్టుకునేది. ఎత్తుకునేది; ఆదరించి అన్నం, కాఫీ యిచ్చేది. జుత్తు పోషణ చేసి, బట్టలు తొడిగే దేవత. తన్ని నిరంతరం సంరక్షించి కాపాడే కనురెప్ప. అప్పుడప్పుడు బుగ్గల్ని నొక్కుతూ ముద్దుపెట్టుకుంటుంది కూడాను.

అట్లాంటప్పుడీ "మీనాక్షికి... ఆ చూపుకూడా వుంటేనా ? ఇంత చిన్నపిల్లనీ ఏ గంధర్వుడో ఎత్తుకుపోను" అనేది.

ఆ మాటలు మీనాక్షి తను కొంచెం అందకత్తె అనీ, గంధర్వుడంటే తనకి, అమ్మా నాన్నా చేప్పే కథల్లోని ఏ రాజకుమారుడి వంటివాడోననీ అనుకునేది. నిజంగా అందమయిందే కూడాను.

మీనాక్షి అయిదోఏడు రాగానే ప్రత్యేకంగా పెట్టిన పనిమనిషిని మాన్పించారు. ఆమెకి ఒకగది ప్రత్యేకించారు; నిప్పు మొదలైన ప్రమాదాల్నించి కాపాడ్డానికి.

మీనాక్షికి ఇంకా ఇద్దరు అన్నలూ, ఒక అక్కా వున్నారు. అంతా చాలా పెద్దవాళ్లు. వాళ్ళుకూడా తన్ని మాట్లాడించేటప్పుడు చాలా ప్రేమపూరితంగానూ, జాలిగానూ పిల్చేవారు. అన్నీ తనెదో పెద్ద లోపంతో పుట్టినట్టు అనిపించేవి, కాని ఇట్లాంటి అమ్మా, అన్నలూ, అక్కా వున్నంతకాలం తనకేం లోపం జరుగుతుంది?

మీనాక్షి పాటలు చక్కగా పాడగలదు. గ్రామఫోను దగ్గర కూచుని, సులువుగా పట్టుకుని తిరిగి పాడి వినిపించేది.

"గొప్ప గాయకురాలు అవుతుంది" అనేవారు కొందరు. "అవునమ్మా ఆ దేవుడు అంత నీచుడు అనుకుంటున్నారేమో? ఒక అవయవ లోపం కల్పిస్తే ఇంకోదానికి రెట్టింపు శక్తీ ఇస్తాడు" అనేవారు మరికొందరు.

ఆమె గలమెత్తి పాడుతుంటే విన సొంపుగా, మృదుమధురంగా వుండేది.

ఏమీ కష్టంలేకుండా పదకొండేళ్ళవరకూ మీనాక్షి జీవితం సాఫీగా నడిచింది – లోపల నించి ఎవరూ మార్పు చెయ్యలేని గుడ్డితనపు బాధ రంపంలా కోస్తున్నా.

అప్పుడే తల్లి కేదో పెద్దజబ్బు చేసింది. ఆ మాట విన్నపుడు మీనాక్షి గుండెల్లో రాయిపడినట్టయింది. ఇంట్లో అంత గొడవగా వుండేది. ఎవరో డాక్టరు వొస్తోవుండేవారు. తల్లి పట్టిన మంచం విడవలేకుండా వుంది.

అందరూ ఆమె సేవలోనే నిమగ్నులవుతున్నారు. మీనాక్షిని ఆదరించేవాళ్ళు తక్కువయ్యారు. పెద్దవొదిన మాత్రం సమయానికి ఇంత అన్నం, కాఫీ యిచ్చేది. పోని తల్లిదగ్గరే కూచుందామనుకున్నా ఏ ఫ్లాస్కో, ఔన్సుగ్లాసో తంతే, అందరూ పడి తిడతారు.

అప్పటికే నాలుగయిదుసార్లు ఏపనిలోనో సహాయం చెయ్యబోయి, పెరుగో, పాలో వొలకపోస్తే, అన్నయ్య కేకలేశాడు––

నాన్నకి అసలు తీరిక లేదు. ఉద్యోగంతో, ఇంటి గొడవల్తో సరిపోయేది. ఇదివరకైతే ఏ సాయంత్రమో తీరిగ్గా కూచుని దగ్గిరికి తీసుకుని కబుర్లు చెప్పేవాడు. అమ్మకి జబ్బు చేశాక అదీ కొరతయింది.

తన గుమ్మంలోంచి వెళ్ళేవాళ్ళు తల్లి బాగోగుల్ని గురించి, ఎవరో తరుముకొస్తున్నట్టు త్వరితంగా చెప్పేసి పోయేవారు. తల్లిని కలుసుకుంటానంటే "వొద్దు, శ్రమ" అనేవారు.

తన్ని అంతగా ప్రేమించిన తల్లి క్షేమం కనుక్కోనివ్వకపోవడం చాలాబాధగా అనిపించింది. ఒకసారి తనే ఎవర్నీ అడక్కుండా వెళ్ళసాగింది. తల గోడకి తగిలి పడిపోయింది. రక్తం కారింది. అప్పుడు రెండో అన్న విసుక్కుంటో గదిలో కూలేసి "కదలకు, తక్కినవాళ్ళ పని చెరుపుకూడాను" అని గదిమాడు. మొహం మీదిరక్తం అట్లానే పెచ్చులు కట్టింది. పుణ్యానికి వెడితే పాపం ఎదురు?

ఆర్నెల్లు తీసుకుని తల్లి శాశ్వతంగా కళ్లు మూసుకుంది. తన సగం ప్రాణం పోయినట్లేడ్చింది, మీనాక్షి. ఇప్పుడిప్పుడు బాగా తెలుస్తోంది, గుడ్డితనపు బాధ.

పెత్తనం యింట్లోదంతా వొదినది. అక్క, అత్తారింటికి పోయింది. తండ్రికి వేరే యావ లేదు. జీవచ్ఛవంలా వున్నాడు. ఇంట్లోకి కావల్సినవన్నీ తెచ్చి, సగంసగం తిని విచారంలో కూచోడంతో సరిపోయేది, ఆయనకి.

మీనాక్షి ఇప్పుడు పుష్టిగానూ, అందంగానూ తయారయింది. పదిహేనేళ్ళదానిలా కన్పించేది. ఆమె ఆమెకే ఆశ్చర్యంగా తోచేది. వొళ్ళు తడుముకుని చూసుకున్నప్పుడల్లా, ఎంతో గర్వంతోనూ, సంతోషంతోనూ వుప్పొంగిపోయేది. ఆ నున్నతనానికి, గుండ్రనితనానికి మూర్ఛనలుపోయేది. జుత్తుపొడవూ, లావూ దాని అందాన్ని అడక్కుండానే చెప్పేది. నుదురూ, చెంపలూ, సన్ననివేళ్ళూ అన్నీ ఏవో గొప్పగా తోచేది.

కాని యింట్లో పరిస్థితులు మనస్సుని కుదించేవి. పెద్దవిచారం మనస్సుని కమ్ముకునేది. చల్లారిన కాఫీ, వేళతప్పిన భోజనం ఆనమాయితయింది. ఏమన్నా పెదిమ కదిపితే, "ఎవళ్ళకి వాళ్లే చస్తుంటే, ఇదేమిటమ్మాయి? ఏదో వొకటి తినక!" అనేవాడు పెద్దన్నయ్య.

'పోనీ' అని నాన్నతో సమయం చూసుకుని అంటే "అమ్మ చచ్చిపోయాక నాకు ప్రపంచకమే పోయినట్టుందమ్మా. ఎటొచ్చీ నీకోసం యీ ప్రాణాలు గుప్పిట పట్టుకుంట. నిన్ను కూడా ఒక యింటిదాన్ని చేస్తే ప్రాణాలు నిశ్చింతగా పోతాయి."

వేడికన్నీళ్ళు ఆమె చేతిమీద పడేవి. ఇంక తండ్రితో చెప్పడం మానుకుంది.

తండ్రి మాటని ఎవరూ అంత పట్టింపుగా తీసుకోలేదు. గుడ్డిదాన్ని పెళ్ళాడేవాడెవడని? వొదినలు మాత్రం మనస్సులో హేళనగా అనుకొని వుంటారు.

మీనాక్షి కెందుకో వొళ్ళు జలదరించింది. భర్త ఏదో ఉద్యోగంచేసి వచ్చినట్టు, తను చొక్కా గుండీలు విప్పుతున్నట్టూ, కాఫీ నౌఖరుచేత యిప్పించి హార్మోనియం వాయించి, ఆనందింపజేస్తున్నట్టూ, కారులో షికారుకి వెడుతుంటే తను ఏమీ పట్నశోభ ఆనందించక పోయినా, భర్తే అన్నీ చెబుతున్నట్టూ, బీచ్‌లో ముంగురులూ, చీర గాలికి ఎగురుతుంటే

సముద్రపు హోరులో భర్తతో తక్కినవాళ్లు వినపడకుండా చక్కగా మాట్లాడుతున్నట్టూ, ఏవేవో వూహాచిత్రాలు మనస్సులో ప్రయాణం చేసాయి.

మళ్ళీ – ఆ భర్త ఏ నీచుడో అవ్వొచ్చును; ఇప్పుడు వీళ్ళిచ్చే డబ్బుకి ఆశించి, వొప్పుకున్నా తన గుడ్డితనాన్ని చూసి తన్ని అసహ్యించుకుని, లోకువచేసి, ఇతరులతో సుఖంగా గడిపేవాడు అవవచ్చును.

నాన్న ఏదో దురభిప్రాయపడుతున్నాడుగాని చూస్తూ గుడ్డివాళ్ళని పెళ్ళాడ్డాని కిష్టపడే వాడెవడుంటాడు?

రెండో విధమైన ఆలోచనని సాధ్యమైనంత వరకూ మనస్సునించి తోలేసేది మీనాక్షి. వెయ్యి జన్మలకీ సంతోషాన్నిచ్చే భర్తనిమ్మని వెయ్యి దేముళ్ళకీ, మనసులోనే మొక్కుకునేది.

అప్పుడప్పుడు అన్నయ్యలు అంటూంటే "ఏ గాయకురాల్నిగానో చెయ్యాలనో", ఏ బొంబాయి గుడ్డివాళ్ళ స్కూల్లోనో చదివించాలనో" అనే ఆలోచనలు స్వతంత్ర జీవితంమీద ఆశని కల్పించేవి.

చివరికి ఒక నెల్లాళ్ళలో ఏదో ఒక సమ్మంధం నిర్ణయించాడు, తండ్రి.

పెళ్ళివారు చాలా బీదస్తులు. పెళ్లికొడుకు దగ్గర కొన్ని అవలక్షణాలుకూడా వున్నాయి. కొంచెం కష్టనష్టాలు పట్టాక మంచి లక్షణాలవే అబ్బుతాయనుకున్నాడు తండ్రి. తల్లి దండ్రులు కొన్నింటిని కప్పిపెట్టారు. కొడుక్కి అసలు పెళ్ళవుతున్నందుకూ, గుడ్డిదయినా అందులో గొప్పకుటుంబానికి చెందిన కోడలొస్తున్నందుకూ అమితానందభరితులయ్యారు. కొడుక్కి అసలు పెళ్లికి ఒప్పుకోడమే పెద్ద త్యాగమయిపోయింది. పెళ్ళవకపోవడాన్నే ఆహ్వానించే మనిషి.

తండ్రి యిచ్చిన పదెకరాల భూమితోనూ, మూడువేల ధనంతోనూ మీనాక్షి పెళ్లి అయిపోయింది. మీనాక్షి తండ్రికి ప్రపంచకంలో సాధించవల్సినవన్నీ సాధించినట్లయింది. తలమీంచి బండరాతిని దింపినట్టయింది.

పెళ్లయిన ఏడాదిలోనే మీనాక్షి కాపరానికి వెళ్ళింది – అంటే అందరూ అనుకోడానికి. భాస్కర్రావు ఆమెని పరవాన్నంలో ఈగకంటే అసహ్యంగా భావించుకున్నాడు. అసలు కన్నెత్తి చూడలేదు. చూడదల్చుకోలేదు.

అత్తమామలు చాలా ఆదరంతో చూసేవారు, కడుపులో పెట్టుకుని. అది కొంతవరకూ మనశ్శాంతినిచ్చింది. ఇంటి పనుల్లో కదలకుండా కూచుని చెయ్యగలిగిన పనులన్నీ జేసి తోడ్పడేది మీనాక్షి.

భాస్కర్రావుకి ఆమెపైగల ద్వేషానికంతా కారణం ఆమె గుడ్డిదనే. ఆ ద్వేషమే అతని నిర్లక్ష్యానికి, అనాదరణకీ మార్గమయింది.

ఇట్లా ఒక సంవత్సరం గడిచేటప్పటికి బ్రహ్మాండమైంది.

రాత్రుళ్ళు కంట తడిబెట్టుకుంటూ గడిపేది. ఆసంగతి అత్తమామలకిమాత్రం తెలియనీ లేదు. తను చెప్పినట్టు తెలిస్తే భర్త మరింత ఏంబాధపెడతాడోనని భయం. అంత కష్టానికి తనే కారణం కనక అంతా మనస్సులో పెట్టుకోదల్చింది.

భాస్కరావు అల్లరిచిల్లరిగా తిరిగి వేళకాని వేళ రాత్రుల్లింటికి వస్తుండేవాడు. అప్పుడే వేసవికాలం ప్రవేశించింది. ఆ వేళే పక్కలు బయటవెయ్యడం మొదలెట్టారు. అత్త మామలు వీధిలో పక్క వేసుకుని, కొడుక్కీ, కోడలుకీ తూర్పువసారా వొదిలిపెట్టారు.

భాస్కరావు వొచ్చేటప్పటికి వొంటిగంట దాటింది. మీనాక్షి వసారాలో పక్కవేసుకుని పడుక్కుంది. పన్నెండు దాటేవరకు ఏడ్చి ఏడ్చి అలిసి నిద్దరోయింది.

పుచ్చపువ్వులాంటి వెన్నెల కటకటాల్ని చీల్చుకుని లోపల పడుతోంది. అవతల ఇంకో పక్క తెల్లగా అనాదరణకి పాల్పడివుంది.

మీనాక్షి భూదేవి వొడిలోలా తెల్లని పక్కమీద, దుప్పటన్నా నలక్కుండా, అందమైన వెన్నెల్లో అమాయకంగా నిద్రపోతోంది. జట్టు నల్లపాములా పక్కని పడివుంది. నల్లనికుంతలాలు ముఖకమలాన్ని కప్పుతున్నాయి. పెద్ద కనురెప్పలు ధ్యానంలోలా మూయబడివున్నాయి.

అప్పుడు లోపల అడుగెట్టాడు భాస్కరావు. ఇంతవరకూ మీనాక్షిని సరిగా చూసి ఎరగడు. ఆ చంద్రకాంతి ఆమె సౌందర్యం చూసి అదిరిపడ్డాడు.

ఇన్నాళ్ళూ ఇంత సౌందర్యానికేనా తను గుడ్డిగా వుంది? ఒకసారి కళ్ళు నులుముకుని మళ్ళీ రూఢిపర్చుకున్నాడు. మనసు వుద్రేకంలో నిండసాగింది. ఆ శాంతమయ వాతావరణం దానికి తోడ్పడసాగింది. 'గుడ్డివాళ్లకి మాత్రం శరీరసౌందర్య ముండకూడదని ఎక్కడుంది?' అనుకున్నాడు.

మీనాక్షి శరీరపు నునుపుదనంలో చంద్రకాంతి ప్రతిబింబిస్తోంది. చెంపలు ముద్దు పెట్టుకునేంత అందంగా వున్నాయి.

వెళ్లి పక్కని కూచుని ఆమెచేతిమీద చెయ్యి వేశాడు. మేలుకుంది. ఉలిక్కిపడి, కూచుని "ఎవరు వారు?" అంది.

"నేను. ఏం... నేనే" అన్నాడు.

"ఆ... మీరా... మీరు?" కంఠం వొణకసాగింది.

అతను ఆమెను దగ్గిరికి తీసుకున్నాడు. మీనాక్షి శరీరానికి గగుర్పాటు కలిగింది. ప్రతీ అవయవంలో రక్తం వింతచైతన్యంతో తిరగబడుతోంది. భర్త...? స్త్రీకి అంతకంటె కావల్సిందేముంది.

"ఇవాళ... చాలా... సుదినం..."

తర్వాత అంది, అతని పెదిమల్ని వేళ్ళతో ఆనుతూ. అతను ఆమె జుత్తుని సద్దుతున్నాడు.

"అవును ఈ చంద్రుడు సాక్ష్యం." ఆకాశంలోకి చూస్తున్నాడు, కటకటాల్లోంచి, ఇన్నాళ్లూ తను చేసిన తప్పు తెల్సుకున్నట్టు.

మీనాక్షి చంద్రుడ్నీ, వెన్నెల్నీ వూహించుకుంటోంది.

అలిసిపోయి అతను నిద్రపోయాడు.

అట్లా ఎంతోసేపు ఆలోచించుకుని నిద్దరోయింది మీనాక్షి.

*15. 12. 1946–ఆనందవాణి వారపత్రిక*